క్లుప్తంగా

కంటి వెలుగు.. దేశానికి దిక్సూచి



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పార్థసారథిరెడ్డి

వేంసూరు: రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం దేశానికే దిక్సూచిగా నిలుస్తోందని రాజ్యసభ సభ్యుడు బండి పార్థ సారథిరెడ్డి అన్నారు. మండలంలోని కందుకూరులో ఏర్పాటుచేసిన కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం ఎంపీ ప్రారంభించి మాట్లాడారు. ఎవరు కూడా కంటి సమస్యలతో బాధపడొద్దనే భావనతో సీఎం కేసీఆర్ కంటి వెలుగుకార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగేశ్వరరావు, నాయకులు ప్రభాకర్ రెడ్డి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



కోర్టు ప్రాంగణంలో మొక్కకు నీరు పోస్తున్న జడ్జి

సత్తుపల్లిటౌన్: ప్రాణకోటికి జీవనాధారమైన మొక్కలు నాటడాన్ని అందరూ బాధ్యతగా భావించాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని నాలుగో అదనపు జిల్లా జడ్జి డాక్టర్ పి.శివరామప్రసాద్ అన్నారు. సత్తుపల్లి కోర్టు ప్రాంగణంలో ఎంపీవీ వెంకటపుల్లయ్యతో కలిసి శుక్రవారం సాయంత్రం ఆయన మొక్కలు నాటారు. అనంతరం జడ్జి మాట్లాడగా, సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి, జూనియర్ సివిల్ జడ్జి శ్రావణస్వాతి, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.గోపాలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వీ.రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు వంకదారు రామకృష్ణ, కొండపల్లి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్యాంకు పథకాలను ఉపయోగించుకోవాలి

పెనుబల్లి: ఏపీజీవీబీ బ్యాంకు పథకాలను గ్రామీణ ప్రజలు ఉపయోగించుకోవాలని ఏపీజీవీబీ పెనుబల్లి శాఖ మేనేజర్ అన్సర్ తెలిపారు. పెనుబల్లి మండలంలోని కర్రాలపాడులో రైతులకు, గ్రామస్తులకు ఏపీజీవీబీ బ్యాంక్ ద్వారా అందుతున్న పథకాలను వివరించారు. ప్రధాన మంత్రి యోజన, జీవన జ్యోతి యోజన పథకాల ద్వారా 20, 436 ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ చెల్లించి వారి కుటుంబాలకు రక్షణ సౌకర్యం కల్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ పృథ్వీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొట్టిన టిప్పర్.. వ్యక్తికి తీవ్ర గాయాలు

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరులో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూరుకు చెందిన పప్పుల రమేష్ ఆటో వేసుకుని వస్తుండగా గ్రీన్‌ఫీల్డ్ హైవేకు మట్టి తోలుతున్న టిప్పర్ ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ పప్పుల రమేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన రమేష్‌ను కల్లూరులో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. కల్లూరు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వే బ్రిడ్జి యజమానిపై దాడి

తల్లాడ: కాటా విషయంలో జరిగిన ఘర్షణలో వే బ్రిడ్జి యజమానిపై లారీ డ్రైవర్, క్లీనర్ దాడి చేశారు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... తల్లాడ మండలం మల్సూర్‌తండా వద్ద ఉన్న వే బ్రిడ్జిలోకి గురువారం రాత్రి మణుగూరు మండలం రామానుజవరానికి లారీ డ్రైవర్ వినయ్‌కుమార్, క్లీనర్ ఉదయ్‌కిరణ్ ఇసుక లోడ్‌తో వచ్చారు. ఈక్రమంలో కాటా వేయించాక వే బ్రిడ్జి యజమాని చల్లా శివకృష్ణతో గొడవ జరగగా ఆయన తలపై డ్రైవర్, క్లీనర్ సిమెంట్ బ్రిక్స్‌తో మోదాడు. ఈ ఘటనపై ఆయన చేసిన ఫిర్యాదుతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

విద్యార్థులు భయం వీడాలి

కొణిజర్ల: పరీక్షలంటే విద్యార్థులు భయం వీడి ప్రణాళికతో సిద్ధమైతే విజయం సులభమవుతుందని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ఇంపాక్ట్ ఫౌండేషన్ డైరెక్టర్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో రాబోవు పరీక్షల్లో విజయం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో పరీక్షల పట్ల గల భయాన్ని తొలగించడానికి చక్కని ఉదాహరణలతో వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, ప్రిన్సిపల్ డాక్టర్ జాన్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, అడ్మిషన్స్ డైరెక్టర్ చిన్నయ్య, హెచ్‌ఓడీ డాక్టర్ హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని వసూళ్లు..!

- ఇంటికి తెచ్చిన ఒక్కో సిలిండర్‌కు అదనంగా రూ. 50 ఇవ్వాల్సిందే
- తీరు మార్చుకోని వంట గ్యాస్ పంపిణీ దారులు
- నిబంధనలు బేఖాతర్
- పట్టించుకోని అధికార యంత్రాంగం



వేంసూరు: గ్యాస్ వినియోగదారుడు కంపెనీ నిర్దేశించిన ధర రూ.1,092 చెల్లిస్తే అందులో గ్యాస్ ఏజెన్సీకి కమిషన్ అందుతుంది. ఆ కమిషన్ పొందిన ఏజెన్సీ 10 కిలో మీటర్ల లోపు ఉచితంగా అందజేయాల్సి ఉంటుంది. దాటితే మరో రూ.10 లు అదనంగా తీసుకోవాలి అంతకు మించి వినియోగదారుల నుంచి ఎటువంటి డబ్బులు వసూలు చేయరాదని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ ఎక్కడ కూడా ఉచితంగా గ్యాస్ డెలివరీ తీసుకున్న దాఖలాలులేవు. సింలెండర్ తీసుకున్న ప్రతీ ఒక్కరు రూ.50లు అదనంగా డెలవరీ బాయ్స్‌కు ముట్ట చెబుతున్నారు. వేంసూరు మండలంలో మొత్తం సుమారు 15,880 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కొందరు ఒకనెల, మరికొందరు రెండునెలలకు, ఇంకొందరు మూడు నెలలకు ఒకసారి గ్యాస్ బుక్ చేస్తుంటారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి ఒక్కోదానిపై రూ.50 లెక్కేస్తే రూ.లక్షల రూపాయిలు భారం వినియోగదారులపై పడుతుంది.

వినియోగదారు పై భారం..

వేంసూరు మండలంలోని మర్లపాడు, లచ్చన్నగూడెం, వెంకటాపురం గ్రామాల్లో రూ.30 అదనంగా వసూళ్లు చేయగా.. మొద్దులగూడెం, భీరపల్లి, శంబునిగూడెం, కొండెగట్ల, చిన్న మల్లెల గ్రామాల్లో ఒక్కో బండపై రూ.58 అదనంగా చెల్లిస్తున్నారు. రూ.1,092 ఉన్న గ్యాస్ సిలెండర్ వినియోగ దారుడికి చేరే సరికి రూ.1,150 అవుతుంది. గ్రామాల్లోకి గ్యాస్ ఆటో సమయం తెలియపోవడంతో వినియోగ దారులు కిరాణ దుకాణదారుల వద్ద నగదు, గ్యాస్ బండ ఉంచుతున్నారు. ఎవరైన అదనంగా గ్యాస్ డబ్బులు ఎందుకు చెల్లించాలి అని అడిగితే వచ్చే నెల గ్యాస్ ఇస్తారో లేదో అని వినియోగదారులు భయపడుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు వినియోగదారుడికి జరుగుతున్న చిల్లర దోపిడీపై దృష్టి సారించడంలేదు. ఆయా గ్యాస్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు క్షేత్ర స్థాయిలో పరిస్థితులు పట్టించుకోవడం లేదు. వినియోగదారుల ఇబ్బందుల తెలుసుకునే ప్రయత్నం చేసిన దాఖలాలు లేవు.

ఉన్నతాధికారులు స్పందించాలి..



గ్యాస్ సిలెండర్లపై అధికంగా వసూళ్లు చేస్తున్నారని గతంలో తహసీల్దార్ దృష్టికి సైతం తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. ఒక్కో సిలెండర్‌పై రూ.30 నుంచి 50 వరకు వసూళ్లు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– బాస్కర్ల వీరంరాజు, మర్లపాడు

ప్రతి నెల భారం అవుతుంది..



ప్రతినెల రూ.50లు అధికంగా చెల్లిండటం భారంగా మారుతుంది. రూ.1,092లు ఉన్న సిలెండర్ రూ.1,150 చెల్లించి కొనాల్సిన పరిస్థితి దాపురించింది. పౌరసరఫరా అధికారులు స్పందిస్తే, గ్రామాల్లో మధ్య తరగతి ప్రజలకు భారం తగ్గుతుంది.

– జంగ జమలయ్య, చౌదవరం

రైతు రుణమాఫీ చేయాలి



ఏన్కూరు: తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

మధిర/కొణిజర్ల/ఏన్కూరు: రైతు రుణాలు వెంటనే మాఫీ చేయాలని, ధరణిలో సమస్యలు పరిష్కరించి అర్హులైన రైతులకు పట్టాదార్ పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మధిర మండల సమితి అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, మురళీకృష్ణ, సీపీఐ అనుబంధ తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మధిర తహసీల్దార్ రాజేష్, కొణిజర్ల తహసీల్దార్ దొడ్డారపు సైదులు, ఏన్కూరు తహసీల్దార్ ఎస్‌కే ఖాసీమ్ లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధరణిలో దొర్లిన భూ సంబంధిత తప్పులను వెంటనే సరిదిద్దాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలను సకాలంలో రైతులకు అందించాలని, 50 సంవత్సరాలు వయసు నిండిన రైతులందరికీ నెలకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ ప్రకటించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. అన్ని గ్రామాలలో ఆక్రమణలకు గురి అవుతున్న డొంకలు, రహదారులు కాపాడి అభివృద్ధి చేయాలన్నారు. ఆయా కార్యక్రమాలల్లో సీపీఐ మండల కార్యదర్శి కొండలరావు, ప్రకాష్‌రావు, నాగ కృష్ణ, కొండ, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి సోమయ్య, నాయకులు సీతారాములు, వెంకటేశ్వర్లు, రామారావు, వెంకయ్య, గోపయ్య, వెంకన్న, బాబూరావు, సీపీఐ నాయకుడు అమరనేని వీరభద్రం, తెప్పల సత్యం, బానోత్ రాంబాబు, చీకటి పుల్లయ్య, సురేష్, మంకెన కృష్ణ, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడా పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై కవిత

బోనకల్: మండల కేంద్రంలోని సాయిబాబా కల్యాణ మండపం ఎదురుగా శుక్రవారం పాఠశాల విద్యార్థులకు ఎఫర్ట్ సేవాసంస్థ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎస్సై తేజావత్ కవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలస్థాయిలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్న ఎఫర్ట్ సంస్థను అభినందించారు. ముష్టికుంట్ల, బోనకల్ పాఠశాల విద్యార్థులు కబడ్డీ, ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు .అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్వేత, ఎఫర్ట్ ఆర్గనైజింగ్ సభ్యులు విజయ్‌కుమార్, సురేష్, కరుణ, అరుణ, రాణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ వితరణ



స్టడీ మెటీరియల్ తీసుకున్న విద్యార్థులతో ఎస్సై రామారావు

కారేపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను ప్రోత్సాహిస్తే.. వారు అన్ని రంగాల్లో రాణిస్తారని కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు అన్నారు. శుక్రవారం కారేపల్లి, బాజుమల్లాయిగూడెం ఉన్నత పాఠశాలలతో పాటు, కారేపల్లి కస్తూర్బాగాంధీ విద్యాలయంలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు కస్తూర్బా ఫౌండేషన్ సహకారంతో ఎస్సై పుష్పాల రామారావు స్టడీ మెటీరియల్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు రానున్న నెల రోజులు చాలా కీలకమని, ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలను సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయానికి కంప్యూటర్..

కారేపల్లి: కారేపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయానికి 'క్రియా చారిటీ యూఎస్' ప్రతినిధులు మేదరమెట్ల లేఖ, మాగంటి శ్రీనిజ, బత్తుల సరోజిని కుటుంబ సభ్యులు ఒక కంప్యూటర్, ప్రింటర్, ప్రొజెక్టర్, స్పీకర్‌లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాగా చదివే పేద విద్యార్థులకు ఉన్నత చదువులు చదివేందుకు తమ సంస్థ నుంచి ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా ఎస్ఓ జాన్సీసౌజన్య, ఉపాధ్యాయులు స్వాతి, విజయలక్ష్మి, కవిత, అధ్యాపకులు కృష్ణవేణి, రమ, వసంత తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రం

పెనుబల్లి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టె విధానాలను అవలంబిస్తుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. శుక్రవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మోదీ హయంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో చలమాల విఠల్‌రావు, కొప్పుల వెంకటేశ్వరరావు, బెజవాడ సాయిశేషు, కండె సత్యం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత

ఎర్రుపాలెం: వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నారని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు నూతక్కి నర్సింహారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన నమో కిసాన్ దివస్ పేరుతో పలువురు రైతులతో ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో 75 శాతం మందికిపైగా వ్యవసాయ రంగంపైనే జీవిస్తున్నారని అలాంటి రంగానికి ప్రధాని మోదీ అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయింపు చేస్తున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు దక్కకుండా సీఎం కేసీఆర్ చేస్తున్నాడని తెలిపారు. ఈ ఎన్నికల్లో తెలంగాణాలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వరరావు, మండల కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు చంద్రమౌళేశ్వరరావు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులున్నారు.



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

ముదిగొండ: మండలంలోని సువర్ణాపురం, ఖానాపురం, గ్రామాల్లో శుక్రవారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజులు పర్యటించారు. ఖానాపురంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్యకర్తలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. సువర్ణాపురంలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. జాతీయ రహదారిపై అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని రైతులు గ్రామస్తులు ఎంపీ రవిచంద్ర దృష్టికి తీసుకురావడంతో కేంద్రమంత్రి గడ్కారీ ఏపీతో ఫోన్‌లో మాట్లాడారు. అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. నేషనల్‌హైవే పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఖానాపురం, పండ్రేగుపల్లి సర్పంచ్‌లు మాశోజు ఉషా, అమరయ్య, నాయకులు వెంకట్, దర్మారావు, లక్ష్మారెడ్డి, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాధయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన తుమ్మల



రాధయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తుమ్మల

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరులో శుక్రవారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి రాధయ్య కాంస్య విగ్రహాన్ని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. రాధయ్య ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధయ్యతో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, రంగారావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఎరువులపై సబ్సిడీలో కోత విధించిన కేంద్రం



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

కల్లూరురూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని విస్మరించడంతో పాటు రైతులపై ఆర్థిక భారం మోపే నిర్ణయాలు తీసుకుంటుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతురాంబాబు అన్నారు. శుక్రవారం ముదిగొండ అంజయ్య అధ్యక్షతన జరిగిన కల్లూరు మండల కార్మిక కర్షక సదస్సులో ఆయన మాట్లాడారు. ఎరువులు సబ్సిడీ యాభై వేల కోట్లు తగ్గించడం దారుణమన్నారు. ఇది రైతులకు పెనుభారంగా కానున్నది. ఏప్రిల్ 5న ఢిల్లీలో కార్మిక, కర్షక మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు తన్నీరు కృష్ణార్జున్, రైతు సంఘం జిల్లా నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, హనుమయ్య, నరసింహారావు, నాగేశ్వరరావు నాయుడు, రామనాధం, వెంకటసత్యం, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వార్ వన్ సైడే...

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎంపీ నామా నాగేశ్వరరావు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన ఎంపీ నామా, ఎమ్మెల్యే రాములునాయక్

వైరా: రానున్న ఏ ఎన్నికల్లోనైనా రాష్ట్రం, జిల్లాలో వార్ వన్‌సైడ్‌గానే సాగుతుందని... గత రెండు ఎన్నికలతో పోలిస్తే బీఆర్ఎస్ మరింత మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ గుమ్మానికి చేరాయని.. ఈ విషయాన్ని ప్రజలకు వివరిస్తూ బూత్ లెవల్‌లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. గత ఎన్నికల్లో బూత్ స్థాయిలో ఏం జరిగిందనే సమాచారం తన వద్ద ఉందని, ఈ విషయమై త్వరలోనే చర్చిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ కేసీఆర్‌కు సమఉజ్జీలు రాష్ట్రంలో ఎవరూ లేరని చెప్పారు. డిసెంబర్‌లో ఎన్నికలలు జరిగే అవకాశమున్నందున పార్టీకి నష్టం కలిగించే చర్యలకు దిగొద్దని హితవు పలికారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే రాములునాయక్ ఇండిపెండెంట్‌గా గెలిస్తే తామే గెలిపించామని చెబుతున్నవారు బీఆర్ఎస్‌కు ద్రోహం చేసినట్లు కాదా అని ప్రశ్నించారు. సమస్యలుంటే పరిష్కరించుకుంటూ, ప్రస్తుతానికి పోలిస్తే మరింత మెరుగ్గా పని చేయాలని సూచించారు.

గిరిజన బంధు వస్తే నేనే ముందు తీసుకుంటా..

త్వరలో సీఎం కేసీఆర్ దళితబంధు మాదిరిగా గిరిజన బంధు ప్రకటిస్తారని.. గిరిజన బంధు వస్తే తానే ముందు తీసుకుంటానని వైరా ఎమ్మెల్యే రాములునాయక్ తెలిపారు. కేసీఆర్ నిర్ణయానికి కట్టుబడి అందరూ పనిచేయాలని, కారు గుర్తుపై పోటీ చేసే వారిని వచ్చే ఎన్నికల్లో గెలిపించేందుకు కలిసికట్టుగా పని చేయాలన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే వారిని వదిలే ప్రసక్తి లేదని, ప్రజలు కూడా వారికి గుణపాఠం చెబుతారని తెలిపారు. అనంతరం గుండ్రాతి మడుగు మాజీ సర్పంచ్ బానోత్ సక్కుబాయి తదితరులు బీఆర్ఎస్‌లో చేరగా ఆహ్వానించారు. రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వర్లు, ఎంపీపీ వేల్పుల పావని, జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, మార్కెట్ చైర్మన్ బీడీకే.రత్నం, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవితో పాటు పసుపులేటి మోహనరావు, కట్టా కృష్ణార్జునరావు, మోటపోతుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను వెలికి తీయాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

మధిర: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను ఉపాధ్యాయులు వెలికి తీయాలని ఆర్వీఎం సెక్టోరియల్ అధికారి రామకృష్ణ కోరారు. మధిర టీవీఎం పాఠశాలలో జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశానికి శుక్రవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. పిల్లలు, ఉపాధ్యాయుల వైఖరిలో మార్పు రావాలని సూచించారు. ఎంఈఓ వై.ప్రభాకర్ మాట్లాడుతూ.. ట్రాకర్ యాప్ గురించి వివరించారు. ప్రతి పాఠశాలలో లైబ్రరీ బుక్స్ పిల్లలతో చదివించాలని కోరారు. ఎఫ్ఎల్ఎన్ అధికారి ప్రభుదయాళ్ మాట్లాడుతూ.. ఇంగ్లీష్ పాఠాన్ని విద్యార్థులకు ఏ విధంగా బోధించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నారాయణ, అసిస్టెంట్ సెక్రటరీ యరమల కోటారెడ్డి, సీఆర్‌పీ ప్రభాకర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

వైరా: అగ్ని ప్రమాదాల పట్ల విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైరా అగ్నిమాపక శాఖాధికారి సీహెచ్ మాధవరావు అన్నారు. వైరా మున్సిపాలిటీ శాంతినగర్‌లోని మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో శుక్రవారం ఆ శాఖాధికారులు విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వేసవికాలం ప్రారభమయినందున ఎక్కడ బడితే అక్కడ అగ్ని ప్రమాదాలు జరగే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగితే నీళ్లు పోసి మంటలార్పే ప్రయత్నం చేయొద్దన్నారు. గ్యాస్ సిలెండర్ల వల్ల జరిగే అగ్ని ప్రమాదాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. పాఠశాలలు, షాపింగ్ మాల్‌లు, ఫంక్షన్‌హాల్‌లలో తప్పని సరిగా ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రయోగాత్మకంగా కార్బన్‌డైఆక్సైడ్ డీసీపీ సిలెండర్ ఎలా వినియోగించాలో వివరించారు, ఫైర్ ఇంజన్ ద్వారా మంటలార్పే పద్ధతి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, మేరీ ఇమ్మాక్యులేట్ హెచ్‌ఎం సిస్టర్ రాజపుష్పం, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ఇంటిపన్ను వసూళ్లను వేగవంతం చేయాలి



ఇంటిపన్నుల వసూళ్లను పరిశీలిస్తున్న ఎంపీఓ రాజారావు

కారేపల్లి: ఇంటిపన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఎంపీఓ పి.రాజారావు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం సింగరేణి (కారేపల్లి) గ్రామ పంచాయతీలో ఇంటిపన్నుల వసూళ్ల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022 – 23 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తున్న కారణంగా ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఇంటిపన్నుల కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలన్నారు. అదే విధంగా ఆయా గ్రామ పంచాయతీల ప్రజలు ఇంటిపన్నులు సకాలంలో చెల్లించి, గ్రామ పంచాయతీల అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో సింగరేణి గ్రామ పంచాయతీ కార్యదర్శి యాకలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో సరుకు రవాణా

మధిర: అతి తక్కువ ఖర్చుతో వేగంగా, భద్రంగా, మీకు అతి చేరువగా టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్ ద్వారా సరుకు రవాణా చేయబడుతుందని లాజిస్టిక్ ఏటీఎం వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం మధిర బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన లాజిస్టిక్ నూతన పీసీసీ ఏజెంట్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా సరుకు రవాణా సుదూర ప్రాంతాలకు సైతం తక్కువ సమయంలో చేరవేయడం జరుగుతుందన్నారు. మధిర పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మధిర పురవీధుల్లో మైకుల ద్వారా లాజిస్టిక్ కరపత్రాలు అందజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఆర్టీసీ మధిర డిపో మేనేజర్ దేవదానం, రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ హరివర్మ, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బి.వెంకటేశ్వరరావు, కార్గో పాయింట్ ఇన్‌చార్జీ లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఆర్టీసీ అధికారులు

సాగర్ జలాలతో చెరువులు నింపాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

మధిర: మండలంలో ఉన్న అన్ని చెరువులను సాగర్ జలాలతో నింపాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మందా సైదులు డిమాండ్ చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్‌లో తహసీల్దార్ రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగర్ జలాలతో చెరువులను నింపడంతోపాటు ఆయకట్టు చివరి పొలాల వరకు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలు గ్రామాల్లో యాసంగి వరి, మిర్చి, మొక్కజొన్న, చెరకు తదితర పంటలకు సాగునీరు అందక ఎండిపోతున్నాయని తెలిపారు. పంట చేతికందే సమయంలో నీళ్లు అందకపోవడంతో తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు సంఘం నాయకులు మోహన్‌రావు, పడకంటి మురళి, మద్దాల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.